క్లుప్తంగా

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మునగాల : త్వరలో జరగనున్న ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పి.ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 01.11.2020 కంటే ముందు పట్టభద్రులైన వారు ఫామ్ -18లో ఓటరు నమోదు వివరాలు (ఎపిక్ నెం.), ఆధార్ కార్డు వివరాలు, డిగ్రీ లేదా డిప్లోమా సర్టిఫికెట్, మొబైల్ నెంబర్, ఈ-మెయిల్ ఐడి, పాస్ ఫొటో జతపరచిన దరఖాస్తును తహసీల్దార్ కార్యాలయంలో ఫిబ్రవరి ఆరవ తేదీలోగా అందజేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నేడు గురుకులంలో ఇంటర్ ప్రవేశ పరీక్ష


గురుకుల పాఠశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం గురుకుల ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్షకు 500 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


జామ్లాతండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ జగన్‌నాయక్

మఠంపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని జామ్లాతండాలో జిల్లా పరిషత్ నిధులు రూ.3 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దారావత్ శౌరీనాయక్, మోతీలాల్, కోటా, బాలు, కాంతారావు, బాబు, హనుమా, రమేష్, బోజ్యా, గోవిందా, రాముడు, రాంజీ, టీకంనాయక్ తదితరులు ఉన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో రమ్యశ్రీకి ద్వితీయ బహుమతి


ప్రశంసాపత్రం అందుకుంటున్న రమ్యశ్రీ

అనంతగిరి : సూర్యాపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ స్టడీస్‌టాలెంట్ టెస్ట్‌లో అనంతగిరి మండలంలోని గోండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అంగడాల రమ్యశ్రీ ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం తల్లాడ శ్రీనివాసరావు తెలిపారు. సోషల్ స్టడీస్ ఫోరం అధ్యక్షుడు రామినేని వెంకటయ్య, జనరల్ సెక్రటరీ కిరణ్‌ల చేతుల మీదుగా విద్యార్థి బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందుకున్నట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది మండవ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలి

గరిడేపల్లి : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కె. యాకూబ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవన్‌లో మీసాల మట్టయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తూ అభివృద్ధిని అటకెక్కించిందన్నారు. అనంతరం రాయినిగూడెం సీపీఎం సర్పంచ్ దోసపాటి స్వరూపభిక్షం, బోయళ్ల జ్యోతిఅర్జున్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాచమళ్ల రామస్వామి, దోసపాటి భిక్షం, బాహుబలి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం గురుకుల ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, నాయకులు వెంకటేశ్వర్లు, నెహ్రూ, రాంబాబు, ఉపేందర్, ఏ.వెంకటేశ్వర్లు, రవికృష్ణ, రజని, ఎస్‌ఎన్.మూర్తి పాల్గొన్నారు.

రుణాలు పొంది.. అభివృద్ధి చెంది

- రైతులకు తోడ్పాటుగా నడిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం
- పీఎంఈజీపీ పథకం కింద రుణాలు అందజేత
- కోళ్ల ఫారాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్న కర్షకులు


సిరిపురం వద్ద రైతు రాములు నిర్వహిస్తున్న కోళ్ల ఫారం

నడిగూడెం : నడిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. మండలంలోని పలు గ్రామాల రైతులు సంఘం అందజేసే రుణాలు పొంది కోళ్ల ఫారాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. సంఘంలోని 20 మంది సభ్యులకు గత ఏడాది పీఎంఈజీపీ పథకం కింద ఒకొక్కరికి రూ.12 నుంచి 15 లక్షల రుణాలను రాయితీపై అందజేశారు. దీంతో మండలంలోని సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, వేణుగోపాలపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, రామాపురం, తదితర గ్రామాలకు చెందిన రైతులు కోళ్ల ఫారాలు పెట్టుకున్నారు.

కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని..

పలువురు రైతులు పలు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని వారి వద్దే కోడి పిల్లలను తీసుకొచ్చి పెంచుతున్నారు. దీంతో పిల్లలు పెరిగే వరకు దాదాపు 40 రోజుల పాటు కోళ్ల దాణా, వాటికి మందులు ఆ కంపెనీలే బరాయిస్తున్నాయి. దాదాపు 2 నుంచి 2.5 కిలోల బరువు వచ్చిన తర్వాత సంబంధిత కంపెనీలే ఆ కోళ్లను కొనుగోలు చేస్తున్నాయి. దీంతో ఒక విడతకు దాదాపు లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తున్నదని పలువురు రైతులు అంటున్నారు.

రూ.15 లక్షల రుణం తీసుకున్నా



నడిగూడెం సహకార సంఘంలో గత ఏడాది రూ.15 లక్షల రుణం తీసుకున్నాను. ఆ డబ్బుతో మా గ్రామ సమీపంలోని నా వ్యవసాయ భూమిలో రెండు షెడ్‌లు నిర్మించుకొని బ్రాయిలర్ కోళ్లు పెంచుతున్నాను. ఇప్పటివరకు మూడు విడతలుగా దాదాపు 30 వేలకు పైగా కోళ్లు పెంచి మూడు లక్షల రూపాయల ఆదాయం పొందాను.

– గుండెపూరి రాములు, రైతు, సిరిపురం

ఆశాజనకంగా ఆదాయం



బ్రాయిలర్ కోళ్ల పెంపకంపై ప్రత్యేక శిక్షణ తీసుకొని కోళ్లను పెంచుతున్నాము. ఓ కంపెనీ కోడి పిల్లలు సరఫరా చేస్తున్నది. దాదాపు 40 రోజులలో ఒక్కో కోడి 2 నుంచి 2.50 కిలోల బరువు వచ్చిన తర్వాత కంపెనీ ప్రతినిధులు వచ్చి కోళ్లను తీసుకెళ్తున్నారు. ఆదాయం ఆశాజనంగానే ఉన్నది.

– షేక్.ఆశా బేగం, రైతు, వల్లాపురం

రైతుల అభివృద్ధే లక్ష్యం



నడిగూడెం ప్రాథమిక సహకార సంఘంలోని సభ్యులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో సేవలందిస్తున్నాం. రైతులు వ్యా పారాలు పెట్టుకుని ఆదాయం పొందేలా సహకారం అందిస్తున్నాం. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– పుట్టా రమేష్, నడిగూడెం పీఏసీఎస్ చైర్మన్

వైద్యుల సేవలు మరువలేనివి


మహిళా వైద్యాధికారులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల, పెంచికల్‌దిన్న మహిళా వైద్యులు పున్నా నాగిని, ఎర్రమాల సీతామహాలక్ష్మి, హోమియో వైద్యాధికారి రాయల శృతిలను లయన్స్ క్లబ్ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో మహిళా వైద్యాధికారిణిలు ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కొణతం సీతారాంరెడ్డి, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, కర్రి సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస్, నీలా శ్రీనివాస్, సురేష్, శంకరాచారి, వైద్య సిబ్బంది హరికృష్ణ, సాగర్, శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, నర్సయ్య తదితరులు ఉన్నారు.

దారి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సజ్జాపురం గ్రామ రైతులు

పాలకవీడు : పంట పొలాలకు వెళ్లే దారిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామం నుంచి చెరువు కట్ట మీదుగా మూసీనది వరకు పొలాలకు వెళ్లే బాటను అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకున్నాడని తెలిపారు. సుమారు వంద ఏళ్ల నుంచి ఇదే బాటలో పొలాలకు వెళ్తున్నామని, ప్రస్తుతం ఆక్రమణతో ట్రాక్టర్లు, బండ్లు వెళ్లడానికి వీలులేకుండా పోయిందన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రైతులు విజయభాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, చంద్రారెడ్డి, రాంబాబు, శ్రీనివాసరెడ్డి, సైదిరెడ్డి, బాలసైదిరెడ్డి, శంకర్, కోటయ్య, నాగార్జున్, ఇంద్రారెడ్డి, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న మహిళలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని కానుకమాత చర్చి ఉత్సవాల్లో భాగంగా శనివారం మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. మహిళలు, యువతులు, బాలికలు తీరొక్క రంగులతో రంగవల్లులు వేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాదర్ మార్టిన్ పసల, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి శౌరీ, వస్కుల జయరాజు, రాయలు, ప్రసాద్, నాగరాజు, వీరస్వామి, సందీప్, జోజి, అంజి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కూరగాయల దినోత్సవం


కూరగాయలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిలుకూరు : మండలంలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం కూరగాయల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పలు కూరగాయలను ప్రదర్శించారు. కూరగాయాల ప్రత్యేకతను, వాటి లాభాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్, ఉపాధ్యాయులు భవాని, స్వప్న, కవిత, పీఈటీలు నరేష్, షరీఫ్ విద్యార్థులు ఉన్నారు.

టీఎస్ సీపీఎస్‌ఈయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ ప్రకాష్‌రావు, సంఘం నాయకులు

మోతె : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం టీఎస్ సీపీఎస్‌ఈయూ టేబుల్ క్యాలెండర్‌ను తహసీల్దార్ ప్రకాష్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్‌ఈయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజయ్, సుధాకర్, ఉపేందర్, నాగయ్య, వెంకటేశ్వర్లు, రూపాదేవి, సామ్రాజ్యం, సాయిలు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటటౌన్ : సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 9వ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని జయ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పాఠశాల నుంచి 36 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ లెవల్‌కు అర్హత సాధించారు. 5వ తరగతి నుంచి ఇద్దరు, 6వ తరగతి నుంచి 10 మంది, 7వ తరగతి నుంచి 11 మంది, 8వ తరగతి నుంచి ముగ్గురు, 9వ తరగతి నుంచి తొమ్మిది మంది, 10వ తరగతి నుంచి ఒకరు అర్హత సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను నీటితో నింపాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తాళ్ల నరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే చెరువులు, కుంటలు ఎండిపోయి, బోర్లు, బావులు అడుగంటి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాలేరు రిజర్వాయర్ నింపేందుకు మాత్రమే ఎన్నెస్పీ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారని, అది నిండిన తరువాతైనా నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను నింపాలని ఆయన కోరారు.

సబ్ రిజిస్ట్రార్‌కు వినతి

హుజూర్‌నగర్ : డాక్యుమెంట్ రైటర్స్‌కు ప్రభుత్వం లైసెన్స్‌లు ఇవ్వాలని కోరుతూ శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ షఫీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలు గౌడ్, మహ్మద్ హలీమ్, కాల్వ వీరేశ్వరరావు, అష్రఫ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


సన్మానిస్తున్న అన్నమయ్య భజన మండలి సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని 15వ అంగన్‌వాడీ కేంద్రం టీచర్, బీఎల్‌ఓగా పనిచేస్తున్న అక్కమ్మ ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అంగన్‌వాడీ టీచర్ అవార్డు పొందారు. దీంతో శనివారం స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శ్రీఅన్నమయ్య భజన మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాచిమంచి కొండయ్య, అనంతలక్ష్మి, చప్పిడి భిక్షం, రాము, రజిని, పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల రెఫరీగా వీరస్వామి

గరిడేపల్లి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో గత మూడు రోజులుగా జరుగుతున్న 49వ జాతీయ జూనియర్ కబడ్డీ పోటీలకు గరిడేపల్లి మండల పరిధిలోని రంగాపురం గ్రామానికి చెందిన కొంపెల్లి వీరస్వామి రెఫరీగా వ్యవహరించినట్లు తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఆదివారంతో ముగియనున్నాయి. కాగా, వీరస్వామి హైదరాబాద్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో కబడ్డీ కోచ్‌గా పనిచేస్తున్నారు.

విత్తనాల దుకాణం ఎదుట రైతుల ఆందోళన

మేళ్లచెరువు : మండలకేంద్రంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దుకాణం యజమాని తమకు నాసిరకం విత్తనాలు విక్రయించాడని ఆరోపిస్తూ శనివారం దుకాణం ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దుకాణంలో జొన్న విత్తనాలు కొనగోలు చేశామని, కానీ పంట కాపు రావడం లేదని, ఎత్తు పెరగడం లేదని తెలిపారు. దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి, పోలీసులకు పిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఉచిత విద్య, వైద్యం అందించాలి

మేళ్లచెరువు : ఉపాధి హమీ కూలీల కుటుంబాలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. శనివారం మేళ్లచెరువు మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూలీలకు రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. వారికి ప్రతి వారం చెల్లింపులు చేయాలన్నారు. ఉపాధి హమీ పనులను మున్సిపాలిటీ కేంద్రాలకు విస్తరింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పెల నారాయణరెడ్డి, భద్రారెడ్డి, సత్యం, సింహాద్రి, సారెడ్డి పాపిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి


జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సత్యం, తదితరులు

మునగాల : ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు అందె సత్యం అన్నారు. శనివారం మునగాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్ బాబు అధ్యక్షత వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన ఆలోచనలు పర్యావరణ పరిరక్షణ కోసం ఉండాలని, మూఢ నమ్మకాలపై దృష్టి పెట్టవద్దన్నారు. ఎమ్మెస్ విద్యా సంస్థల అధినేత పందిరి నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియంలో కోదాడ మండలం ద్వారకుంట జెడ్పీహెచ్‌ఎస్, ఇంగ్లిష్ మీడియంలో టీఎస్‌ఆర్‌ఎస్ తుంగతుర్తి బాయ్స్ పాఠశాల, ప్రైవేటు స్కూల్స్ నుంచి సూర్యాపేటలోని అంజలి స్కూల్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక నిర్వాహకులు తెలిపారు. తొలుత స్థానిక ఎంపీపీ బిందు జెండా ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు డీఎస్.స్వామి, పి.వి.దుర్గాప్రసాద్, రామాంజనేయులు, ఓరుగంటి రవి, స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం దండు సీతారామరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి


హుజూర్‌నగర్‌రూరల్ : ఎంపీడీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషణబోయిన హుస్సేన్ కోరారు. శనివారం వారు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లావణ్యకు సమ్మె నోటీస్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆరోపించారు. దేశానికి ఆర్థిక వనరులు సమకూర్చే ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్మేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు హసన్‌మియా, కార్మికులు సురభి వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, కనకయ్య, రంగారెడ్డి, జోష్, సైదులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్ పోస్టర్ల ఆవిష్కరణ

దురాజ్‌పల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్తంగా సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంటా నాగయ్య తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో పారిశ్రామిక సమ్మె -గ్రామీణ భారత్ బంద్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ధ్వంసం చేస్తూ కార్పొరేట్లకు అమ్మేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గుంటి మురళి, హమాలీ మిల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకుడు ఒగ్గు వెంకన్న, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'రెడ్ కలర్ డే' వేడుకలు


ఎరుపు రంగు దుస్తుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన రెడ్ కలర్ డే వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులంతా ఎరుపు రంగు దుస్తులు ధరించి పాఠశాలకు రావడం ఆకర్షణగా నిలిచింది. ప్రిన్సిపాల్ బుస్సా సులోచన మాట్లాడుతూ రంగులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమ్య, లక్ష్మి, వైదేహీ, హనీఫా, మల్లిక, భాగ్యలక్ష్మి, ఉష పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌లకు ఘన సన్మానం


మునగాల : మాజీ సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం గ్రామ మాజీ సర్పంచ్ దొంగరి రమాదేవి- శ్రీనివాస్ దంపతులను, పాలకవర్గ సభ్యులను శనివారం బీఆర్‌ఎస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దొంగరి రమాదేవి మాట్లాడుతూ తన పదవీకాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తొగరు రమేష్, బీఆర్‌ఎస్ నాయకులు సుంకర అజయ్‌కుమార్, తొగరు సీతారాములు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గ్రామపెద్దలు కీత రామయ్య, బుసి వెంకటేశ్వర్లు, పోతుగంటి వెంకటేశ్వర్లు, గోవర్ధన్, జిల్లేపల్లి నాగయ్య, కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో..


గరిడేపల్లి : మాజీ సర్పంచ్ వీరంరెడ్డి లక్ష్మీశంభిరెడ్డిలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గరిడేపల్లి : మండలంలోని పరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో మాజీ సర్పంచ్ వీరంరెడ్డి లక్ష్మీశంభిరెడ్డిల దంపతులను శనివారం ప్రధానోపాధ్యాయుడు గుగులోతు సైదానాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ల కాలంలో సర్పంచ్‌కు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి నెల రూ.5వేల గౌరవ వేతనాన్ని విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం పాఠశాలలో వలంటీర్‌ను నియమించినట్లు ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రజిత, పంచాయతీ కార్యదర్శి రేణుక, అంగన్‌వాడీ టీచర్ సుగుణ, ఆయా నర్సమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

11,12 తేదీల్లో విద్య, వైజ్ఞానిక మహాసభలు


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నడిగూడెం : ఖమ్మం పట్టణంలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర ద్వితీయ విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.భిక్షం కోరారు. శనివారం నడిగూడెం మండలంలోని తెల్లబల్లి ఉన్నత పాఠశాలలో మహాసభల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. సమాజంలో అంతరాలు లేని సమాన విద్యనందించాలని, బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, లక్ష్మీనర్సయ్య, కాశీం, ధనమూర్తి, నాగేశ్వరరావు, రామాంజలిదేవి, వెంకటరమణ పాల్గొన్నారు.

తెలంగాణకు అన్యాయం జరగనివ్వం

- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్ : కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగనివ్వమని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) శ్రీశైలం, నాగార్జునసాగర్ నదీ జలాల నిర్వహణ బాధ్యతలను కేంద్ర జలశక్తి సంఘానికి అప్పగిస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతం ఎడారిగా మారుతుందని చెప్పారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరించడం సిగ్గుచేటని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం ఈ విషయాన్ని వ్యతిరేకించిందని తెలిపారు. బచావత్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం తెలంగాణ జలాల వాటా విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహరించిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా పోరాటం చేయాలన్నారు. ఇప్పటికే నాగార్జునసాగర్ ఆయకట్టు కింద పొలాలు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం కృష్ణా జలాల విషయంలో ఉన్న నిబంధనలను యథాతథంగా ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.